సాక్షి మెదక్

మంగళవారం । 29 । ఆగస్టు । 2023



బేరసారాలు

లక్కీ డ్రాలో మద్యం లైసెన్స్ దక్కించుకున్న వారికి కాసుల పంట పండుతోంది. ఆశావహులు లక్షలు చెల్లించి దుకాణాలను సొంతం చేసుకుంటున్నారు. 8లో



షీటీమ్స్‌తో మహిళలకు భరోసా

షీ టీమ్స్ ద్వారా మహిళలకు, బాలికలకు సత్వర న్యాయం అందుతుందని సిద్దిపేట పోలీసు కమిషనర్ ఎన్.శ్వేత అన్నారు. 8లో

నేడు రంగంపేటలో 2కె రన్

కొల్చారం(నర్సాపూర్): హాకీ క్రీడాకారుడు ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా కొల్చారం మండలం రంగంపేటలో మంగళవారం 2కే రన్ నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ ఉన్నత పాఠశాల పీడీ శ్రీధర్ రెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. ఎమ్మెల్యే మదన్ రెడ్డి హాజరవుతారని, బీఆర్ఎస్ మండల యువజన అధ్యక్షుడు సంతోష్ రావు సౌజన్యంతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

న్యూస్‌రీల్

రికార్డుల నిర్వహణ భేష్

డీఎల్‌పీఓ యాదయ్య



మొక్కలు నాటే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ యాదయ్య

చిలప్‌చెడ్(నర్సాపూర్): గ్రామ పంచాయతీ రికార్డుల్లో స్వల్ప మార్పులు చేయాలని డీఎల్‌పీఓ యాదయ్య అన్నారు. సోమవారం ఆయన మండలంలోని బండపోతుగల్ పంచాయతీలో ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. అనంతరం డంపింగ్‌యార్డు, నర్సరీ, పల్లెప్రకృతి వనం, వైకుంఠధామం, సీసీ రోడ్లు, మురుగు కాలువలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శి రికార్డుల నిర్వహణ బాగుందన్నారు. అభివృద్ధి పనులు సైతం బాగున్నాయన్నారు. తీసిన గుంతల్లో వెంటనే మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి ఆనంద్ ఉన్నారు.

చట్టాలపై ప్రచారం చేయాలి



మాట్లాడుతున్న జడ్జి జితేందర్

మెదక్: చట్టాలపై ప్రజలకు తెలిసేలా విస్తృతంగా ప్రచారం చేయాలని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సెక్రెటరీ, జిల్లా జడ్జి జితేందర్ అన్నారు. సోమవారం జిల్లా కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. లీగల్ ఎయిడ్ కౌన్సిల్స్, అండర్ మోడల్ స్కీం కౌన్సిల్స్, ప్యానెల్ లాయర్స్, రిటేనర్ లాయర్స్‌కు బాధితులకు అందించాల్సిన న్యాయ సహాయం, ఇతర అంశాలపై సూచనలు చేశారు. సమావేశంలో సీనియర్ అడ్వకేట్ పోచయ్య, లీగల్ ఎయిడ్ కౌన్సిల్స్, అండర్ మోడల్స్ స్కీమ్స్ కౌన్సిల్స్, ప్యానెల్ లాయర్స్, తదితరులు పాల్గొన్నారు.

సేవతోనే గుర్తింపు



మాట్లాడుతున్న మాడరేటర్ రెవ.ధర్మరాజ్ రసాలమ్

మెదక్: స్వచ్ఛమైన సేవతోనే ప్రభువును చేరుకుంటామని మద్రాస్ చర్చి మాడరేటర్ రెవ.డాక్టర్ ధర్మరాజ్ రసాలమ్ అన్నారు. మెదక్ సీఎస్ఐ చర్చిలో సోమవారం మెదక్, డోర్నకల్ డయాసిస్‌లకు చెందిన సుమారు 600 మంది మత గురువులకు నిర్వహించిన సదస్సులో ఆయన హాజరై మాట్లాడారు. ప్రభువు మార్గాన్ని బోధించే ప్రతీ ఒక్కరు సేవా దృక్పథంతో మెలగాలని పేర్కొన్నారు. క్యాక్రమంలో రెవ.డాక్టర్ రూబెన్ మార్క్(డిప్యూటీ మాడరేటర్), డాక్టర్ పద్మారావు మోడరేటర్, డాక్టర్ విమల్ సుకుమార్, భాస్కర్, విల్సన్, శాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు గడువు పెంపు



మెదక్ కలెక్టరేట్: మెదక్ మినీ గురుకులంలోని పీఈటీ, వంటమనిషి పోస్టుల దరఖాస్తులకు స్వీకరణ ఈనెల 31 వరకు గడువు పెంచినట్లు కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. పీఈటీ పోస్టుకు డిగ్రీతో పాటు బీపీఎడ్ పూర్తి చేసి ఉండాలని, వంటమనిషి పోస్టుకు గిరిజన మహిళా అభ్యర్థులు పదో తరగతి పూర్తి చేసి ఉండాలన్నారు. తాత్కాలిక పద్ధతిలో పని చేసేందుకు అర్హత, ఆసక్తిగల అభ్యర్థులు మెదక్‌లోని మినీ గురుకులంలో దరఖాస్తులను అందజేయాలన్నారు.

రైతుసంక్షేమ పథకాలు సక్రమంగా చేపట్టండి



రైతు సంక్షేమ పథకాలపై సమీక్షిస్తున్న డీఏఓ గోవింద్

హవేళీఘనపూర్: పంటల నమోదు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ అన్నారు. సోమవారం మండల కేంద్రమైన హవేళీఘనపూర్ మండల వ్యవసాయ అధికారి కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. పంటల నమోదు, రైతుబంధు, రైతుబీమా, రైతు రుణమాఫీపై అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి నాగమాధురి, ఏఈవోలుపాల్గొన్నారు.

నిర్మించారు.. వదిలేశారు

ఆటలకు నోచుకోని సింథటిక్ ట్రాక్

- రూ.5.50 కోట్లు వెచ్చించి ఏర్పాటు
- అకాడమీ లేక ఇక్కట్లు
- క్రీడాకారులకు తప్పని ఎదురుచూపులు





మెదక్ జిల్లా కేంద్రంలోని సింథటిక్ ట్రాక్

మెదక్: చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో మైదానాలు ఏర్పాటు చేసి సౌకర్యాలు కల్పిస్తోంది. జిల్లా కేంద్రంలో రూ.5.50 కోట్లు వెచ్చించి నిర్మించిన 400 మీటర్ల సింథటిక్ ట్రాక్ నిరుపయోగంగా మారింది. ఫలితంగా క్రీడాకారులు ప్రాక్టీస్ చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లా కేంద్రంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(సాయ్) ఆధ్వర్యంలో 2000 సంవత్సరంలో ఇక్కడ సింథటిక్ ట్రాక్, కిక్ బాక్సింగ్ అకాడమీలను నిర్వహించారు. ఇక్కడ శిక్షణ పొందిన క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొన్నారు. సరైన వసతులు లేవనే సాకుతో గతంలో కిక్‌బాక్సింగ్ సెంటర్‌ను ఇక్కడి నుంచి తరలించారు. 2016లో ప్రత్యేక జిల్లా ఏర్పాటయ్యాక స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవ వేడుకలను ఇదే గ్రౌండ్‌లో నిర్వహించారు. ఆ సమయంలో పెద్ద పెద్ద బ్యానర్లు కట్టి శకటాలను తిప్పడంతో గ్రౌండ్‌లో గుంతలు పడ్డాయి. దీంతో క్రీడాకారులు ప్రాక్టీస్ చేయలేని పరిస్థితి ఏర్పడింది. 2019లో సింథటిక్ ట్రాక్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.5.50 కోట్లు విడుదల చేసింది. ఈ నిధులతో అంతర్జాతీయ ప్రమాణాలతో ట్రాక్‌ను నిర్మించి, మధ్యలో ఫుట్‌బాల్ కోర్టును ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.70 లక్షలతో శిథిలావస్థలో ఉన్న క్రీడాకారుల హాస్టల్ భవనాన్ని మరమ్మతు చేశారు. 2021లో సింథటిక్ ట్రాక్ పూర్తవగా, 2022లో నిర్వహించిన పోటీల్లో 15 మంది క్రీడాకారులు అథ్లెటిక్స్‌కు ఎంపికయ్యారు.

కేంద్రమంత్రికి విన్నవించినా..

ఈ ఏడాది జూన్‌లో మెదక్‌లో పర్యటించిన కేంద్ర పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి రూపాలాను క్రీడాకారులు కలిశారు. అథ్లెటిక్ అకాడమిని రప్పించాలని, ఇదే గ్రౌండ్‌లో వెయిట్ లిఫ్ట్ అకాడమీ, సింథటిక్ అకాడమీలను ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందించారు. ట్రాక్ నిర్మాణ సమయంలో గచ్చిబౌలికి పంపించిన 8 మంది క్రీడాకారులను నేటికి తిరిగి పంపించలేదని, కేంద్ర మంత్రికి విన్నవించినా ఫలితం లేకుండా పోతోందని క్రీడాకారులు వాపోతున్నారు. మరోవైపు మెదక్‌లో ఏర్పాటు చేసిన కేంద్రానికి వచ్చేందుకు కోచ్‌లు నిరాకరిస్తున్నట్లు తెలిసింది. హైదరాబాద్ వంటి నగరాల్లో ఉంటే అక్కడే విధులు నిర్వహిస్తూ ప్రైవేట్‌గా కోచింగ్ ఇవ్వొచ్చని, హెచ్ఆర్ఏ సైతం వస్తోందనే ఆలోచనతో ఇక్కడికి వచ్చేందుకు ఆసక్తి చూపడంలేదని సమాచారం.

ఆమోదం రాగానే..

మెదక్‌లో సింథటిక్ ట్రాక్ పూర్తయిన విషయాన్ని పై అధికారులకు తెలిపాం. ఢిల్లీ నుంచి ఆమోదం రాగానే అథ్లెటిక్ అకాడమిని ఏర్పాటు చేస్తాం. వెయిట్ లిఫ్టింగ్, ఫుట్‌బాల్ అకాడమిలు కూడా కావాలని క్రీడాకారులు అడిగారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– శరత్‌చంద్ర, డిప్యూటీ డైరెక్టర్, సాయ్

హరితహారం వందశాతం పూర్తి



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజర్షిషా, అదనపు కలెక్టర్లు

కలెక్టర్ రాజర్షి షా

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో హరితహారం లక్ష్యం 4.4లక్షలు కాగా ఇప్పటికే వంద శాతం పూర్తయిందని కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, అధికారులు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆసరా పెన్షన్లు, హరితహారం, బీసీ, మైనార్టీలకు ప్రభుత్వ సాయం, నోటరీ భూముల క్రమబద్ధీకరణ, గొర్రెల పంపిణీ, గృహలక్ష్మి, కారుణ్య నియామకాలపై కలెక్టర్ వివరించారు. సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లో జరిగే వజ్రోత్సవాల ముగింపునకు అధికారులు సిద్ధం కావాలన్నారు. రెండో విడత గొర్రెల పంపిణీ వేగవంతం చేయాలని, గృహలక్ష్మి దరఖాస్తుల పరిశీలన పూర్తి చేసి అర్హులను గుర్తించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, రమేశ్, డీఆర్ఓ పద్మశ్రీ, జెడ్పీ సీఈఓ శైలేష్, డీఎఫ్ఓ రవిప్రసాద్, డీపీఓ సాయిబాబా, అధికారులు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం అందిస్తాం

ఎస్పీ రోహిణి ప్రియదర్శిని



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ రోహిణి ప్రియదర్శిని

మెదక్ మున్సిపాలిటీ: వివిధ సమస్యలపై బాధితులు పెట్టుకున్న అర్జీలపై తక్షణం స్పందించాలని ఎస్పీ రోహిణి ప్రియదర్శిని పోలీస్ అధికారులకు సూచించారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా రోడ్డు వెడల్పులో ఇల్లు పాక్షికంగా పోతుందని, ఇంటి పక్కన ఉన్న తోట బిక్షపతి మా ఇంటిని కూల్చి ఫెన్సింగ్ వేశాడని మెదక్ మండలం పాతూరు గ్రామానికి చెందిన గోపాల్ తెలిపాడు. ఈ విషయంపై ప్రశ్నిస్తే చంపుతానని బెదిరిస్తున్నాడని, రక్షణ కల్పించి న్యాయం చేయాలని కోరాడు. అలాగే శివంపేట మండల కేంద్రానికి చెందిన లక్ష్మి నరసమ్మ తాను ప్రస్తుతం బేగంపేటలో ఉంటున్నానని, సొంతూరులో ఉన్న 33గుంటల భూమిని గ్రామానికి చెందిన కొందరు ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదు చేసింది. చట్టప్రకారం బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని జిల్లా పోలీసు అధికారులకు ఎస్పీ ఆదేశించారు.

సెల్‌ఫోన్లు అందజేత

సీఈఐఆర్‌తో పోగొట్టుకున్న, చోరీకి గురైన సెల్‌ఫోన్లను ట్రేస్ చేయవచ్చని ఎస్పీ రోహిణి ప్రియదర్శిని అన్నారు. ఈ పోర్టల్ ద్వారా రికవరీ చేసిన 2.5 లక్షల విలువైన 10 సెల్‌ఫోన్లను సోమవారం బాధితులకు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, ఆర్ఎస్ఐ సుభాష్, సిబ్బంది పాల్గొన్నారు.

నిజాంపేటలో అభివృద్ధి శూన్యం

మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్ రెడ్డి

నిజాంపేట(మెదక్)/హవేళీఘనపూర్: నూతనంగా ఏర్పాటైన నిజాంపేట మండలంలో అభివృద్ధి జరగడంలేదని మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్ రెడ్డి ఆరోపించారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. మండలంలో తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్, ప్రైమరీ హెల్త్ సెంటర్ భవనం, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుపై పట్టించుకోవడంలేదని ఆరోపించారు. పక్కా భవనాలు లేక ప్రభుత్వ కార్యాలయాలు ప్రవేట్ ఇరుకు గదుల్లో కొనసాగుతున్నాయన్నారు. ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి స్పందించి మండల అభివృద్ధికి కృషి చేయాలన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించండి

మెదక్ కలెక్టరేట్: భగీరథ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బస్వరాజు అన్నారు. సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంటింటా భగీరథ నీళ్ల సరఫరా చేయడంలో ప్రధాన పాత్ర పోషిస్తున్న కార్మికులకు వేతనాలు ఇవ్వకుండా ఆపడం సరకాదన్నారు. జీతాలు లేక కుటుంబ పోషణ భారమై కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, వారి సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు స్వామి, మల్లయ్య, రాజు, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

అదనపు కలెక్టర్ రమేశ్



పల్లెప్రకృతి వనం వద్ద అదనపు కలెక్టర్, ప్రజా ప్రతినిధులు

శివ్వంపేట(నర్సాపూర్): అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ రమేశ్ అన్నారు. సోమవారం మండల పరిధి ఎదుల్లాపూర్‌లో ఆకస్మికంగా పర్యటించారు. పల్లెప్రకృతి వనం, వైకుంఠధామం, హరితహారం మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో మంజూరైన నూతన పంచాయతీ భవన నిర్మాణ పనులు మూడు రోజుల్లో ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. అర్హులకు పథకాలు అందేలా కృషి చేయాలని సూచించారు. గ్రామంలో పల్లె ప్రకృతి ఏర్పాటుకు కృషి చేసిన ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, సర్పంచ్ కీర్తన హన్మంత్‌రావ్‌ను అభినందించారు. కార్యక్రమంలో డీఎఫ్ఓ రవికుమార్, ఎంపీడీఓ నవీన్‌కుమార్, తహసీల్దార్ శ్రీనివాస్‌చారి, కార్యదర్శి రఘువేంద్రభట్టాచార్యులు ఉన్నారు.

అంతర్మథనంలో అసంతృప్తులు

- సిట్టింగ్‌లకు టికెట్ ఖరారుతో అయోమయం
- ముందు నుయ్యి, వెనుక గొయ్యిలా మైనంపల్లి రోహిత్, శేరి సుభాశ్‌రెడ్డి వర్గీయుల పరిస్థితి



మెదక్: నియోజకవర్గ బీఆర్ఎస్ టికెట్ సిట్టింగ్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డికి ఖరారు కావటంతో అసంతృప్త నేతలు అంతర్మథనంలో పడ్డారు. ఎమ్మెల్యే తీరును విభేదించిన నాయకులు కొందరు మైనంపల్లి రోహిత్‌ను అనుసరించగా, మరి కొందరు ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డి వర్గంలో చేరారు. తమ నాయకుడికే టికెట్ వస్తుందంటూ నమ్మకంతో ఉండగా, అధిష్టానం సిట్టింగ్‌లకు ప్రాధాన్యం ఇచ్చింది. ప్రస్తుతం ఎటు వెళ్లాలో తెలియక అయోమయం చెందుతున్నారు.

రెండు వర్గాల్లో...

మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు కుమారుడు రోహిత్ గత ఆరు నెలలుగా నియోజకవర్గంలో విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపట్టాడు. వచ్చే ఎన్నికల్లో తనకే టికెట్ వస్తుందని ధీమాతో చెప్పడంతో ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి వ్యతిరేకులు కొంతమంది సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మైనంపల్లి వర్గంలో చేరారు. మరో వైపు ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డి వెంట హవేళీఘనాపూర్ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కొనసాగారు. వీరితో పాటు ఎమ్మెల్యేను విభేదించిన మరికొంతమంది బీజేపీ, కాంగ్రెస్‌లలోకి వెళ్లారు. కాగా తాము నమ్ముకున్న నాయకులకు టికెట్ దక్కకపోవడంతో రోహిత్, సుభాశ్‌రెడ్డి వర్గంలో చేరిన నేతలు సందిగ్ధంలో పడ్డారు. ఓ వైపు సిట్టింగ్ ఎమ్మెల్యే వద్దకు తిరిగి వెళ్లలేని పరిస్థితి ఉండగా, వెళితే అసమ్మతి వర్గమనే ముద్ర ఉంటుందని మదనపడుతున్నారు. మొత్తానికి వీరి పరిస్థితి ముందు నుయ్యి, వెనుక గొయ్యి అన్నట్లుగా తయారైంది.

విద్యార్థులను ప్రోత్సహించాలి

జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి



మాట్లాడుతున్న జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి

మెదక్ కలెక్టరేట్: జిల్లా స్థాయి జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌లో అన్ని పాఠశాలల విద్యార్థులు పాల్గొనేలా చూడాలని జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో గైడ్ టీచర్లకు అవగాహన కల్పించారు. అక్టోబర్ చివరి వారంలో నిర్వహించే పోటీలకు విద్యార్థులను సిద్ధం చేయాలన్నారు. ఆరోగ్యం, సంక్షేమం, పర్యావరణానికి అనుబంధంగా 5 ఉప అంశాలపై పోటీలు ఉంటాయని, అంశాలకు అనుగుణంగా నాణ్యమైన ప్రాజెక్టులు రూపొందించేలా ప్రోత్సహించాలన్నారు. ప్రదర్శనకు గ్రూప్ లీడర్‌తో పాటు గైడ్ టీచర్లు హాజరు కావాలని, ఉత్తమమైన 4 ప్రాజెక్టులను రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ అకాడమిక్ కోఆర్డినేటర్ ప్రభ, ఆయా పాఠశాలల టపాధ్యాయులు పాల్గొన్నారు.

కష్టపడే వారిని ఎన్నడూ వదులుకోం

డీసీసీ అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి



మాట్లాడుతున్న తిరుపతిరెడ్డి

మెదక్: కష్టపడిన కార్యకర్తలను కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు వదులుకోదని డీసీసీ అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. బీఆర్ఎస్‌కు చెందిన వ్యక్తులు కొందరు కావాలనే దుష్ప్రచారం చేస్తూ కార్యకర్తలను అయోమయానికి గురి చేస్తున్నారని, వారి మాటలు నమ్మొద్దని అన్నారు. రామాయంపేట రెవెన్యూ డివిజన్ ఏర్పాటు ఘనత కాంగ్రెస్‌తోనే సాధ్యమైందన్నారు. మెదక్ చుట్టూ రింగ్‌రోడ్డు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ఎప్పుడో ఇచ్చిన హామీలన్నారు. 2014 ఎన్నికల సమయంలో అధికారంలోకి వస్తే 100 రోజుల్లో ఎన్‌డీఎస్ఎల్ ఫ్యాక్టరిని తెరిపిస్తామని చెప్పిన బీఆర్ఎస్ నాయకులు ఇప్పటి వరకు ఎందుకు తెరిపించలేదో చెప్పాలన్నారు. కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ చరిత్రాత్మకమని, మహిళా, బీసీ, రైతు, విద్యార్థి డిక్లరేషన్ సైతం అధికారంలోకి రాగానే నెరవేరుస్తుందని, రాబోయే ఎన్నికల్లో మెదక్ ఖిల్లాపై కాంగ్రెస్ జెండా ఎగురవేయడం ఖాయమని పేర్కొన్నారు. అనంతరం ఆయా పార్టీల నుంచి పలువురు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో పీసీసీ నాయకుడు మామిళ్ల ఆంజనేయులు, యూత్ జిల్లా అధ్యక్షుడు మహిందర్‌రెడ్డి, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, చిన్నశంకరంపేట, మెదక్ మండలాల అధ్యక్షులు పోతరాజు రమణ, శంకర్ తదితరులు ఉన్నారు.

ఫిర్యాదులపై తక్షణం స్పందించాలి

- కలెక్టర్ రాజర్షి షా
- నూతన కలెక్టరేట్‌లో మొదటి ప్రజావాణి
- పెద్ద ఎత్తున తరలివచ్చిన ప్రజలు



ప్రజావాణికి తరలివచ్చిన ప్రజలు

మెదక్ కలెక్టరేట్: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం చూపాలని కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. నూతన కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికిప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. కలెక్టర్ రాజర్షిషా, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఆర్ఓ పద్మశ్రీతో కలసి వినతులు స్వీకరించారు. మొత్తం 73 దరఖాస్తులు రాగా పెన్షన్‌కు సంబంధించి 5, డబుల్‌బెడ్‌రూంల కోసం 10, ధరణి సమస్యలపై 41, వివిధ శాఖలకు సంబంధించి 17 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. పాత కలెక్టరేట్‌లోని అన్ని శాఖల కార్యాలయాలు ఈ నెల 31 వరకు కొత్త భవనంలోకి మారాలన్నారు. ఆయా శాఖలకు కేటాయించిన గదుల్లో కాంట్రాక్టర్‌తో అవసరమైన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ శైలేష్, డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్, డీఏఓ గోవింద్, డీసీఎస్ఓ బ్రహ్మారావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దళితబంధు ఇవ్వండి



దివ్యాంగుడిని అయిన నాకు దళితబంధు ఇవ్వడం లేదు. నాకు ఎలాంటి ఆస్తిపాస్తులు లేవు. ఉపాధి కూడా లేదు. రెండో విడతలో పథకం కింద ఎంపిక చేయాలి.

–ఏర్పుల విజయ్, మంభోజిపల్లి

డబుల్ బెడ్‌రూం కేటాయించాలి



నాకు ఎలాంటి భూమి, ఇల్లు లేదు. నివాసం ఉండేందుకు ప్రభుత్వం నుంచి డబుల్‌బెడ్ రూం ఇళ్లు మంజూరు చేయించాలి.

–సిహెచ్.గంగారాం, మెదక్

హక్కు కల్పించండి



తాతల నుంచి వస్తున్న వీఆర్ఏ హక్కును కేవలం ఒక్కరికే పట్టా చేయడంతో మిగతా వాటాదారులకు అన్యాయం జరుగుతోంది. కలెక్టర్ స్పందించి అందరికి న్యాయం జరిగేలా చూడాలి.

– నిజాంపేట గ్రామ వీఆర్ఏ వాటాదారులు

ఉపాధి కల్పించాలి



కలెక్టరేట్ నిర్మాణం జరుగుతున్నప్పటి నుంచి రోజు కూలీగా ఇక్కడే పని చేశా. కొత్త కలెక్టరేట్‌లో స్వీపర్‌గా అవకాశం కల్పించాలి.

– విజయ, గాంధీనగర్, మెదక్

పింఛన్ ఇప్పించండి



పక్షవాతంతో కాళ్లు, చేతులు పడిపోయాయి. కుటుంబ పోషణ కష్టంగా మారింది. కలెక్టర్ స్పందించి పింఛన్ ఇప్పించాలి.

–గ్యార్ల పాపయ్య, కుకునూర్, వెల్దుర్తి

క్లుప్తంగా

మహాధర్నాకు తరలిరావాలి



సభ్యత్వ నమోదు చేస్తున్న ఉపాధ్యాయులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకట్ కిరణ్ ఆరోపించారు. సోమవారం మండలంలోని వివిధ పాఠశాలలో సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. పాఠశాలలో స్కావెంజర్లను నియమించాలని కోరారు. కేజీబీవీ పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. సెప్టెంబర్ 1న నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు శివుడు, ప్రధాన కార్యదర్శి రాజనర్సింహ, రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో హుండీ మాయం

దుబ్బాక: హనుమాన్ దేవాలయంలో హుండీని దొంగలు ఎత్తుకెళ్లిన ఘటన దుబ్బాక మున్సిపల్ పరిధి ధర్మాజీపేట వార్డులో జరిగింది. దుబ్బాక ఎస్సై గంగరాజు వివరాలు. ధర్మాపేట వార్డుకు చెందిన విజయ లక్ష్మణశర్మ హనుమాన్ ఆలయంలో అర్చకుడిగా పని చేస్తున్నాడు. రోజులాగే ఆదివారం ఉదయం పూజా కార్యక్రమాలు నిర్వహించి ఇంటికి వెళ్లిపోయాడు. సోమవారం ఉదయం వచ్చి చూసేసరికి హుండీ కనిపించలేదు. విషయాన్ని కౌన్సిలర్ బత్తుల స్వామికి తెలిపారు. స్థానికులతో వెతికి చూడగా ఎక్కడా కనపడలేదు. హుండీలో రూ.2వేల వరకు ఉంటాయని ఎస్సై తెలిపారు. అర్చకుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

గంజాయి కేసులో పదేళ్ల జైలు



సిద్ధయ్య(ఫైల్)

రామాయంపేట(మెదక్): గంజాయి కేసులో మండలంలోని లక్ష్మాపూర్‌కు చెందిన కుంట సిద్ధయ్యకు కోర్టు జైలుశిక్షతో పాటు జరిమానా విధించింది. స్థానిక ఎక్సైజ్ ఎస్ఐ విజయ్ సిద్దార్థ వివరాలు. 2017లో సిద్ధయ్య వద్ద 410 గ్రాముల గంజాయితో పాటు ఐదు మొక్కలను అప్పటి ఎక్సైజ్ సీఐ రాధాకిషన్ స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం నిందితుడికి పదేళ్ల జైలు, రూ.25వేల జరిమానా విధిస్తూ మెదక్ ఏడీజే కోర్టు మెజిస్ట్రేట్ లక్ష్మీశారద తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ చెప్పారు. ఈ మేరకు నిందితుడిని సంగారెడ్డి జైలుకు తరలించినట్లు ఆయన తెలిపారు.

సోనియా చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

పటాన్‌చెరు టౌన్: చేవెళ్లలో ఎస్సీ, ఎస్టీల కోసం చేసిన డిక్లరేషన్ సందర్భంగా పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద సోమవారం కాంగ్రెస్ నాయకులు సోనియా గాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీలకు 12 అంశాలతో కూడిన డిక్లరేషన్ ప్రకటించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, యువరాజ్, కిషన్, వడ్డే గోపాల్, శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

బేరసారాలు

చేతులు మారుతున్న వైన్ షాప్‌లు

- లైసెన్స్ పొందినవారికి గుడ్‌విల్ ఆఫర్
- కుదరకపోతే పార్ట్‌నర్‌షిప్ కోసం ప్రయత్నాలు



లక్కీ డ్రాలో మద్యం లైసెన్స్ దక్కించుకున్న వారికి కాసుల పంట పండుతోంది. డ్రాలో షాపులు వచ్చినవారికి లిక్కర్ వ్యాపారులు పోటాపోటీగా గుడ్‌విల్ ఆఫర్ చేస్తున్నారు. లక్షల రూపాయలు చెల్లించి అయినా దుకాణాలు పొందేందుకు సిద్ధమవుతున్నారు. బేరం కుదరకపోతే ఆఖరికి పార్ట్‌నర్‌షిప్ అయినా ఇవ్వాలని కోరుతున్నారు.

సాక్షి, సిద్దిపేట: మద్యం వ్యాపారంలో అదృష్టవంతులెవరో తెలిపోయింది. లక్కీ డ్రా ద్వారా వైన్ షాప్‌లను దక్కించుకున్నారు. షాప్‌ల కేటాయింపు జరగడంతో డిసెంబర్ 1 నుంచి నూతన మద్యం పాలసీ ప్రారంభం కానుంది. అయితే లక్కీ డ్రాలో మద్యం దుకాణాలు పొందనివారు నిరాశకు గురయ్యారు. అయినా చివరిప్రయత్నాలు చేస్తున్నారు. వైన్ షాపు దక్కించుకున్నవారితో బేరసారాలు చేస్తున్నారు. గుడ్‌విల్ ఇచ్చేందుకు ముందుకు వస్తున్నారు. కొంతమంది మద్యం వ్యాపారులు, రాజకీయ పార్టీలకు చెందిన నేతలు లక్షల రూపాయలు చేత పట్టుకొని వైన్ షాప్‌ల కోసం ట్రై చేస్తున్నారు. లక్కీ డ్రా ద్వారా వైన్ షాప్‌లను దక్కించుకున్న వారికి డబ్బులు ఆశ చూపిస్తున్నారు. వారి ఇంటి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

గుడ్ విల్

జిల్లాలో మొత్తం 93 వైన్ షాప్‌లుండగా 4,166 దరఖాస్తులు వచ్చాయి. దీంతో ఎక్సైజ్ శాఖకు రూ 83.32 కోట్ల ఆదాయం లభించింది. ఈ నెల 21న విపంచిలో లక్కీ డ్రా ద్వారా వైన్ షాపులను కేటాయించారు. కొన్నేళ్లుగా మద్యం వ్యాపారం చేస్తున్న వారికి, రాజకీయ నాయకులకు తక్కువ మందికి షాపులు దక్కాయి. కొత్తవారికి అదృష్టం వరించింది. ఇటు నేతలు...అటు వ్యాపారులు వైన్ షాప్‌ల కోసం లక్కీ డ్రా ద్వారా టెండర్లు దక్కించుకున్న వారి వెంట పడుతున్నారు. గుడ్ విల్ ఇచ్చి షాప్‌ను దక్కించుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. గుడ్ విల్‌కు ఒప్పుకోకపోతే చివరకు పార్ట్‌నర్ షిప్ అయినా ఇవ్వండని ఒప్పందాలకు దిగుతున్నారు. దీంతో లక్షల రూపాయలు డబ్బు చేతులు మారుతుంది.

> సిద్దిపేట పట్టణంలో అత్యధికంగా వ్యాపారం జరిగే ఓ వైన్ షాప్‌ను రూ 1.1కోట్లను గుడ్ విల్ ఇస్తామని ఒప్పందం కుదుర్చుకున్నారు. అలాగే గజ్వేల్‌లో ఓ వైన్ షాప్ కొనుగోలు చేసేందుకు బేరాలు నడుస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

డిసెంబర్ 1 నుంచి కొత్త పాలసీ

2023–2025 సంవత్సరాలకు మద్యం షాప్‌లు లక్కీ డ్రా ద్వారా వచ్చిన వ్యాపారులు డిసెంబర్ 1 నుంచి ప్రారంభించనున్నారు. ఇప్పటికే వైన్ షాప్ దక్కిన వారు ఎక్సైజ్ ట్యాక్స్‌లో 1/6వ వంతు డబ్బును చాలాన చెల్లించారు. 2021–2023 సంవత్సరాలకు సంబంధించిన మద్యం లైసెన్స్ నవంబర్ 30వ తేదీతో ముగియనుంది.

మా దృష్టికి రాలేదు



వైన్స్ షాప్‌లు గుడ్ విల్ ఇచ్చి తీసుకుంటున్న విషయం మా దృష్టికి రాలేదు. డ్రాలో వచ్చిన వ్యక్తి పేరుమీదనే లైసెన్స్‌ను జారీ చేస్తాం. షాప్‌కు సంబంధించిన అన్ని బాధ్యతలు లైసెన్స్ దారునిదే. షాప్‌నకు సంబంధించిన ఏదైనా చర్యలు ఉంటే లైసెన్స్‌దారుని పైనే తీసుకుంటాం.

–శ్రీనివాసమూర్తి, ఎక్సైజ్ సూపరింటెండెంట్

షీటీమ్స్‌తో మహిళలకు భరోసా

సిద్దిపేట పోలీసు కమిషనర్ శ్వేత



మహిళ పోలీసు స్టేషన్ సీఐ దుర్గను అభినందిస్తున్న సీపీ శ్వేత

సిద్దిపేటకమాన్: షీ టీమ్స్ ద్వారా మహిళలకు, బాలికలకు సత్వర న్యాయం చేయడం జరుగుతుందని సిద్దిపేట పోలీసు కమిషనర్ ఎస్.శ్వేత అన్నారు. అడిషనల్ డీజీపీ ఉమెన్ సేఫ్టీ వింగ్ హైదరాబాద్ వారు జూలై 2023 నివేదికలో సిద్దిపేట జిల్లా షీటీమ్స్ రాష్ట్రస్థాయిలో రెండో స్థానంలో నిలిచినందున సిబ్బందికి సీపీ కార్యాలయంలో సోమవారం నగదు రివార్డు, ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా శ్వేత మాట్లాడుతూ.. అవేర్‌నెస్ కార్యక్రమాల్లో సిద్దిపేట జిల్లా షీటీమ్ రాష్ట్ర స్థాయిలో రెండో స్థానంలో, వెస్ట్ జోన్‌లో మొదటి స్థానంలో నిలవడం గర్వంగా ఉందన్నారు. మహిళలు, బాలికల రక్షణకు ఉన్న చట్టాల గురించి మరిన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ప్రతి పాఠశాల, కళాశాల ఆవరణలో క్యూఆర్ కోడ్ ఉన్న పేపర్‌ను అతికించాలని సూచించారు. షీటీమ్ ద్వారా నమోదు చేసిన పెట్టి కేసులలో నిందితులకు శిక్షలు పడేలా చూడాలని సిబ్బందికి సూచించారు. వీటి గురించి ప్రతీరోజు మానిటర్ చేయాలని మహిళా పోలీసు స్టేషన్ సీఐ దుర్గకు సూచించారు. సిద్దిపేట షీటీమ్ వాట్సాప్ నెంబర్ 8712667434, స్నేహిత మహిళ సపోర్ట్ సెంటర్ 9494639498, సిద్దిపేట మహిళ పోలీసు స్టేషన్ 8712667435నెంబర్లకు ఫోన్ చేసి సేవలను వినియోగించుకోవాలని సూచించారు. సమావేశంలో అడిషనల్ డీసీపీలు అడ్మిన్ శ్రీనివాసరావు, లాఅండ్ ఆర్డర్ మల్లారెడ్డి, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ దుర్గ, ఏఎస్ఐలు ముజీబ్, మహిళా కానిస్టేబుళ్లు పద్మ, సంగీత, జ్యోతి, రజిత, స్వప్న, కానిస్టేబుళ్లు స్వామి, ప్రకాష్, అన్వేష్, యుగంధర్, మహేష్,, రవి పాల్గొన్నారు.

అందరూ సమానమే..

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఆడమగ అనే తేడా ఉండరాదని, అందరూ సమానంగా ముందుకు సాగినపుడే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. స్వార్డ్ స్వచ్ఛంద సంస్థ, అజీమ్ ప్రేమ్ జీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల నుంచి జండర్ సెన్సిటైజేషన్ ఫర్ యూత్ పేరుతో 60 మంది అమ్మాయిలకు వర్క్ షాప్ నిర్వహించారు. ఇందులో భాగంగా సోమవారం నిర్వహించిన కార్యక్రమానికి సీపీ శ్వేత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో స్వార్డ్ స్వచ్ఛంద సంస్థ సీఈవో శివకుమారి, జండర్ సెన్సిటైజేషన్ స్పెషలిస్ట్ గిరిజారాణి పాల్గొన్నారు.

వైభవంగా బంగారమ్మ జాతర



దర్శనం కోసం బారులుదీరిన భక్తులు

మనోహరబాద్(తూప్రాన్): మండలంలోని కాళ్లకల్ బంగారమ్మ జాతర ఉత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి గంప ఊరేగింపు, పోతరాజు గావు, రంగం కార్యక్రమాలను జరిపారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు బారులు దీరారు. కార్యక్రమాల్లో పూజారి వేణుగోపాల్‌శర్మ, సర్పంచ్ నత్తి మల్లేశ్ పాల్గొన్నారు.

రాజీమార్గంలో కేసులు పరిష్కరించాలి



మాట్లాడుతున్న జిల్లా ఇంచార్జి జడ్జి సుదర్శన్

సంగారెడ్డి టౌన్: రాజీమార్గంలో కేసులు పరిష్కరించాలని జిల్లా ఇంచార్జి ప్రధాన న్యాయమూర్తి సుదర్శన్ అన్నారు. సోమవారం జిల్లా కోర్టులో సంగారెడ్డి, జహీరాబాద్, నారాయణఖేడ్, జోగిపేట్ న్యాయవాదులతో వచ్చే నెల 9వ తేదీన నిర్వహించే లోక్ అదాలత్‌పై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కక్షిదారుల మధ్య రాజీ కుదిర్చి కేసులు ఎక్కువ సంఖ్యలో పరిష్కరించాలని అన్నారు. జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా జడ్జిలు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయం కూల్చిన బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ నాయకుల వినతి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న నాయకులు

సిద్దిపేటరూరల్: అర్బన్ మండల పరిధిలోని మిట్టపల్లి గ్రామానికి చెందిన మెరుపు గుట్టపై అక్రమ తవ్వకాలు చేసి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని కూల్చిన వారిపై చర్యలు తీసుకుకోవాలని సోమవారం విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ మెదక్ విభాగ్ సహకార్యదర్శి రాజారాం మాట్లాడుతూ కొద్ది నెలలుగా మిట్టపల్లి మెరుపుగుట్ట వద్ద అక్రమ తవ్వకాలు చేయడంతో పాటు పైన ఉన్న లక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని కూల్చివేశారని, ప్రభుత్వం స్పందించి వారిని శిక్షించాలని కోరారు. కూల్చివేసిన ఆలయాన్ని పునర్నిర్మించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, మిట్టపల్లి నవీన్ పాల్గొన్నారు.

అభివృద్ధి చూసే బీఆర్‌ఎస్‌లోకి వలసలు



బీఆర్‌ఎస్‌లో చేరుతున్న నాయకులు

బెజ్జంకి(సిద్దిపేట): రాష్ట్రంలో సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి పనులతో బీఆర్ఎస్‌లోకి వలసలు పెరుగుతున్నాయని మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పేర్కొన్నారు. మండలంలోని తలారువానిపల్లె గ్రామానికి చెందిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు రాజాబాబు, వెంకటేష్, రజనీకాంత్, అమర్, పవన్ తదితరులు సోమవారం బెజ్జంకి పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో నాయకులు లింగాల లక్ష్మణ్, మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌గుప్త, సర్పంచ్‌లు సంజీవరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మొండయ్య తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు కారణాలతో ఇద్దరి ఆత్మహత్య

తాగుడుకు బానిసై..



గణేష్(ఫైల్)

హవేళీఘనపూర్: తాగుడుకు బానిసైన ఓ యువకుడు ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం మండల పరిధిలోని ఔరంగాబాద్‌లో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన లక్ష్మీశ్రీనివాస్‌ల కుమారుడు గణేష్ (24) కొంతకాలంగా మద్యం తాగుతూ కుటుంబ సభ్యులతో గొడవలు పడుతుండేవాడు. ఈ విషయంలో మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటన స్థలాన్ని హవేళీఘనపూర్ పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లి కావడం లేదని..



శ్రీకాంత్‌రెడ్డి (ఫైల్)

వర్గల్(గజ్వేల్): పెళ్లికావడం లేదని జీవితంపై విరక్తితో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సోమవారం రాత్రి వర్గల్ మండలం వేలూరులో జరిగింది. గౌరారం ఎస్సై విజయభాస్కర్ వివరాలు. వేలూరుకు చెందిన చీదు జనార్దన్‌రెడ్డి, బాలమణి దంపతులకు శ్రీనివాస్ రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి ఇద్దరు కొడుకులున్నారు. పెద్దకొడుకు వివాహమైంది. వ్యాపారం చేసుకుంటున్నాడు. చిన్నకొడుకు శ్రీకాంత్‌రెడ్డి(32)కి ఇంకా పెళ్లి కాలేదు. సంబంధాలు కుదరడం లేదు. దీంతో మనస్తాపానికి గురై సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రతీ పల్లెలో ఏరులై పారుతున్న మద్యం

బీజేపీ ఎమ్మెల్యే శైలేంద్ర



మాట్లాడుతున్న బీదర్ ఎమ్మెల్యే శైలేంద్ర



జహీరాబాద్‌లో బీజేపీ బైక్ ర్యాలీ

జహీరాబాద్ టౌన్: ప్రజలను రాష్ట్ర ప్రభుత్వం మద్యానికి బానిసలుగా చేసిందని జహీరాబాద్ ఇంచార్జి బీదర్ బీజేపీ ఎమ్మెల్యే శైలేంద్ర బెళదలే ఆరోపించారు. ప్రవాజ్ యోజనలో భాగంగా సోమవారం పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. ఆయన స్వయంగా బైక్ నడిపారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ పల్లెలో చూసినా మద్యం షాపులు దర్శనిమిస్తున్నాయని, సారా ఏరులై పారుతుందని ఆరోపించారు. కేసీఆర్ ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా నెరవేరలేదన్నారు. రైతు బంధు కూడా ఇంతవరకు పూర్తిగా ఇవ్వలేదని, రుణ మాఫీ కూడా మొక్కు బడిగా కొనసాగుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రజలు గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాంచందర్ రాజనర్సింహ్మా, జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్నాథ్, అధికార ప్రతినిధి చింతల్ ఘాట్ సుధీర్ కుమార్, మల్లికార్జున్, జనార్దన్‌రెడ్డి, సుధీర్, ప్రశాంత్ పాటిల్, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



మణికుమార్‌శర్మ (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో వ్యక్తి అదృశ్యం కేసు నమోదైంది. సీఐ రవీందర్ రెడ్డి వివరాలు. హైదరాబాద్ మౌలాలికి చెందిన మణికుమార్ శర్మ(34) బంజారాహిల్స్‌లో చార్టెడ్ అకౌంట్‌గా పని చేస్తుంటాడు. రెండు రోజుల క్రితం పటాన్‌చెరు మండలం భానూర్ గ్రామ పరిధిలోని లైఫ్‌స్టైల్ వెంచర్‌లో ఉంటున్న అత్తగారింటికి భార్య చేతనతో కలిసి వచ్చాడు. ఈ క్రమంలో ఆదివారం అత్తాపూర్‌కు వెళ్తున్న అని చెప్పిన మణికుమార్ శర్మ తిరిగి రాలేదు. ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. సోమవారం అతని భార్య పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అతివేగానికి దంపతుల బలి

- రెండు బైకులను ఢీకొట్టిన కారు
- మరొకరి పరిస్థితి విషమం



నవీన్ కుమార్, సుజాత (ఫైల్)

నర్సాపూర్ రూరల్: అతి వేగం, అజాగ్రత్త రెండు నిండు ప్రాణాలను బలి తీసుకుంది. రెండు బైకులను కారు ఢీ కొట్టిన సంఘటన నర్సాపూర్–మెదక్ జాతీయ రహదారిలోని మూతపడిన షుగర్ ఫ్యాక్టరీ సమీపంలో సోమవారం జరిగింది. ప్రమాదంలో భార్యాభర్తలు మృతి చెందగా మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. నర్సాపూర్ ఎస్సై శివకుమార్ వివరాలు. సంగారెడ్డి జిల్లా నిజాంపేట్ మండలం శాఖాపూర్ గ్రామానికి చెందిన గడ్డమీది నవీన్ కుమార్(28), భార్య సుజాత (26)లు బైక్ పై నర్సాపూర్ మీదుగా హైదరాబాద్ వెళ్తున్నారు. మరో బైక్‌పై నర్సాపూర్ మండలం పెద్ద చింతకుంట గ్రామానికి చెందిన కట్ట కరుణాకర్ నర్సాపూర్ వైపు వస్తున్నాడు. హైదరాబాద్ నుంచి నర్సాపూర్ మీదుగా మెదక్ వైపు అతివేగంగా వెళ్తున్న కారు ఈ రెండు బైకులను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో నవీన్ కుమార్ అక్కడికక్కడే మృతి చెందగా అతని భార్య నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో మృతి చెందింది. మరో బైక్ పై వెళ్తున్న కరుణాకర్‌కు తీవ్ర గాయాలు కావడంతో హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. దంపతుల మృతదేహాలను నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో ఉంచారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జీవనోపాధి కోసం....

జీవనోపాధి కోసం నవీన్ కుమార్ హైదరాబాద్ రామచంద్రపురంలో అద్దె ఇంట్లో ఉంటూ ఫొటో ఫ్రేమ్ షాపును నిర్వహిస్తున్నాడు. అతని తల్లిదండ్రులు వృద్ధులైన లింగయ్య, శ్యామమ్మ స్వగ్రామమైన శాఖాపూర్‌లో ఉంటున్నారు. నవీన్‌కుమార్ భార్య మెదక్ జిల్లా చిలిపిచేడ్ మండల కేంద్రంలోని మానసిక దివ్యాంగుల పాఠశాలలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో టీచర్‌గా విధులు నిర్వర్తిస్తుంది. మృతులకు రెండేళ్ల కూతురు సాయి హిమని ఉంది.

డివైడర్‌ను ఢీకొని వ్యక్తి...



అభిజిత్ మృతదేహం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): డివైడర్‌ను ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం భారతీనగర్ డివిజన్ పరిధిలోని ఎల్ఐజీ కాలనీలో జరిగింది. పోలీసుల వివరాలు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తెనాలి ప్రాంతానికి చెందిన అభిజిత్ (23) జీవనోపాధి కోసం ఐదు నెలల క్రితం భారతీనగర్ డివిజన్ పరిధిలోని ఎల్ఐజీ కాలనీకి వచ్చాడు. రిలయన్స్ డిజిటల్‌లో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. కాగా సోమవారం తెల్లవారు జామున 4 గంటల సమయంలో మోటార్ సైకిల్‌పై స్నేహితుడిని లింగంపల్లి రైల్వేస్టేషన్‌లో దింపి ఇంటికి వస్తున్నాడు. ఎల్ఐజీ కాలనీ సమీపంలో బైక్‌ను డివైడర్‌కు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతునికి ఏడాది క్రితమే వివాహం జరిగింది. అతని తండ్రి శశి కేశవరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జిన్నారంలో అర్ధరాత్రి ఉద్రిక్తత

- మహిళ మృతదేహాన్ని ఖననం చేయొద్దని అడ్డగింత



నాయకులతో మాట్లాడుతున్న పోలీసులు

జిన్నారం(పటాన్‌చెరు): మహిళ మృతదేహం ఖననం విషయంలో ఇరువర్గాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకున్నాయి. ఆదివారం రాత్రి 10 గంటలకు జిన్నారంలో ఖననం చేయడానికి గుంత తీస్తుండటంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఇక్కడ ఖననం చేయవద్దని అడ్డగించడంతో ఓ వర్గం వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆదివారం అర్ధరాత్రి ఘటనా కాలనీకి చేరుకున్నారు. అనంతరం సీఐ ఆధ్వర్యంలో మృతదేహాన్ని ఖననం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సోమవారం ఉదయం ఆ ప్రాంతంలో భారీ బందోబస్తు నిర్వహించారు.

పోస్టర్ ఆవిష్కరణ

సిద్దిపేట ఎడ్యుకేషన్: సెప్టెంబర్ 4వ తేదీన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రజా ఉద్యమంలో గద్దర్ పాత్రపై చర్చా గోష్ఠి నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ ప్రసాద్ తెలిపారు. సోమవారం కార్యక్రమ పోస్టర్‌ను కళాశాలలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్యాశాఖ కమిషనర్ వాకాటి కరుణ, రాష్ట్ర మంత్రి తన్నీరు హరీశ్‌రావు, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత కాత్యాయని విద్మహే, దేశపతి శ్రీనివాస్‌లు కీలకోపన్యాసం చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో చరిత్ర విభాగాధిపతి కొలిపాక శ్రీనివాస్, మహేందర్, హుస్సేన్, మధుసూదన్, గోపాల సుదర్శనం తదితరులు పాల్గొన్నారు.

● ప్రమాదకర ప్రయాణం

ట్రాక్టర్‌పై పిల్లలతో కుటుంబసమేతంగా ప్రమాదకరంగా వెళ్తున్న వీరంతా బిహార్, ఒరిస్సా, మధ్యప్రదేశ్ ఇతర రాష్ట్రాలకు చెందిన వలస కార్మికులు. వీరు కొన్ని నెలలుగా సిద్దిపేట పట్టణశివారులోని నర్సాపూర్ వద్ద రైల్వే పనులు చేస్తున్నారు. పనులు ముగింపు దశకు చేరుకోవడంతో సొంత గ్రామాలకు వెళ్లేందుకు సిద్దిపేట పట్టణంలోని న్యూబస్టాండ్‌కు ఇలా ట్రాక్టర్ పై వెళ్తూ సాక్షి కెమెరా కంటపడ్డారు.. కష్టజీవులకు కనీసం సరైన రవాణా సౌకర్యం కల్పించడంలో అధికారులు, కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే దానికి ఈ దృశ్యం నిదర్శనం.

–సాక్షి స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, సిద్దిపేట





ట్రాక్టర్‌పై ప్రమాదకరంగా ప్రయాణం చేస్తున్న వలసకార్మికులు